

మంత్రులను కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఒ.ఆనంద్ రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణలను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం చింతారెడ్డిపాలెంలోని మంత్రి నారాయణ నివాసానికి విచ్చేసిన కలెక్టర్ ఆనంద్ మంత్రికి పూలమొక్క అందజేశారు. అనంతరం నగరంలోని సంతపేటలో గల మంత్రి ఆనం క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన కలెక్టర్ ఆనంద్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఆనంద్‌తో పలు విషయాలపై మంత్రులు చర్చించారు. జిల్లా అభివద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రులు కలెక్టర్‌కు పలు సూచనలు చేశారు.

యువత భవితకు బంగారు బాటలు

ప్రజాశక్తి-నెల్లూరు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి భావితరాల యువత భవితకు బంగారు బాటలు వేద్దామని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని కెఏసి ప్రభుత్వ కళాశాలలో 'డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం..యువత భవితకు బంగారు బాటలు వేద్దాం'అన్న అంశంపై విద్యార్థిని విద్యార్థులకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాలు సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న హాజరయ్యారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రముఖ లాయర్ డిఫెన్స్ డిప్యూటీ కౌన్సిల్ జి.సుబ్బమ్మ, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల డాక్టరు దత్తాత్రేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అవగాహన లోపం కారణంగా డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను చేజేతులరా నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్ధాలను వివరించి, అటువంటి కల్చర్‌కు దూరంగా ఉంటూ ఉన్నత విద్యనభ్యసించి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హర్ష జిల్లా అధ్యక్షులు నరేంద్ర డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ నగర కార్యదర్శి నరసింహ ,ఐద్వా నగర కార్యదర్శి పద్మ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాసరెడ్డి కాలేజ్ ఇతర ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఐద్వానాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిపిసి వైద్యులు దత్తాత్రేయులు

సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుడ్లూరు: సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నెల్లూరు పట్టణంలో ఆగస్టు 5,6 తేదీల్లో నిర్వహించడం జరుగు తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. నెల్లూరు పట్టణంలో ఐదో తేదీన వేలాదిమంది సిఐటియు కార్యకర్తల తోటి ప్రదర్శన బహిరంగ సభ నిర్వ హించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు .ఈ బహిరంగ సభకి సిఐటియు ఆల్ ఇండియా అధ్యక్షురాలు కే హేమలత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు పాల్గొని ప్రసంగిస్తారు. ఈ కౌన్సిల్ సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరవుతారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అంగనవాడీ ఆశా వర్కర్లకి జీతాలు పెంచాలని సిఐటియు నాయకులు విజ్ఞప్తి చేశారు.

జిల్లాను అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలపడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సంతపేటలో గల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి క్యాంపు కార్యాలయంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన పలు అంశాలను మంత్రులు సుధీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా విచ్చేసిన కలెక్టర్ ఆనంద్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి అభివద్ధికి ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడ్తామన్నారు.

మంత్రి నారాయణకు ఘనస్వాగతం

మంత్రి నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

తొలుత మంత్రి ఆనం క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన మంత్రి పొంగూరు నారాయణకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. వీరివెంట రిట్కెర్డ్ ఐఎఎస్ అధికారి కష్ణయ్య వున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ నెల్లూరు, కడప లేఅవుట్లలో అక్రమాలుచోటు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై విచారణ చేసి నివేదిక అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ నియమనిబంధనలకు లోబడి ఉన్న లే అవుట్లకు ఒక వారంలోగా ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే విధంగా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

మహిళల రక్షణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

పనిచేసే ప్రదేశంలో మహిళలకు గౌరవం కల్పిస్తూ, వారి రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎన్జీవోలు, ప్రయివేటు సంస్థల వారితో వెబెక్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, వివిధ రూపాల్లో జరుగుతున్న భౌతిక, మానసిక దాడులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. మహిళా ఉద్యోగులపై జరుగుతున్న దాడులను విచారించేం దుకు జిల్లా స్థాయిలో జిల్లా పంచా యతీ అధికారిణి చైర్ పర్సన్ గా కమిటీ ఏర్పరిచారని, అదేవిధంగా మహిళలు పనిచేస్తున్న వివిధ పని ప్రదేశాలలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. మహిళా హక్కులను కాపాడేందుకు, వారి గౌరవాన్ని ఇనుమడింపచేసే విధంగా గట్టి చర్యలు తీసుకోవా లన్నారు. మహిళలపై లైంగిక వేధింపులు, భౌతిక, మానసిక దాడులు జరిగినప్పుడు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, ఎవరికి ఫిర్యాదు చేయాలనే విషయాలపై కార్యాలయాల్లోని మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా ఫిర్యాదుదారుల వివరాలను గొప్యంగా ఉంచుతారని, సమాచార హక్కు చట్టం ద్వారా కూడా వారి వివరాలను వెల్లడించరాదన్నారు. మహిళలపై దాడులను నిరోధించేందుకు వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

వైభవంగా శ్రీఅంకమ్మ తల్లికి పల్లకి సేవ

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు గ్రామ దేవత ఆదిపరాశక్తి శ్రీ అంకమ్మ తల్లికి ప్రతి శుక్రవారం అమ్మవారికి నిర్వహించే అభిషేకం, పల్లకి సేవ శుక్రవారం విజయ్ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు విజయ్ స్వామి అమ్మవారికి వేదమంత్రాలు మధ్య పంచామృత అభిషేకం నిర్వహించారు. అభిషేకానంతరం అమ్మవారిని కన్నులు పండుగగా అలంకరించారు. కొణిజేటి అనిల్ ధర్మపత్ని లావణ్య పుట్టినరోజు సందర్భంగా కొణిజేటి రవి ధర్మపత్ని జయలక్ష్మి, కొనిజేటి అనిల్ కుమార్ ధర్మపత్ని లావణ్య వారి కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. సాయంత్రం శ్రీ అంకమ్మ తల్లి భక్తుల మధ్య పల్లకి సేవ కన్నుల పండుగ నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్ధప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

-పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

ఎన్‌టిఆర్ నెక్లెస్ రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని స్వర్ణాల చెరువు, ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డును అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శుక్రవారం మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో (2014లో) అభివృద్ధి పనులు ప్రారంభించామని, ఎన్నికలు ముగిసిన తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయకుండా అర్ధాంతరంగా నిలిపివేసిందన్నారు. సుమారు 90 శాతం అభివృద్ధి పనులు టిడిపి ప్రభుత్వం పూర్తిచేస్తే మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయకుండా గాలికి వదిలేసిందన్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయి అభివృద్ధి పనులన్నింటిని త్వరలో ప్రారంభించి పనులు వంద శాతం పూర్తి చేస్తామని, అందుకు సంబంధించిన ప్రణాళికలు తయారుచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, నెక్లెస్ రోడ్డులో వీధిలైట్లు మరమ్మత్తులు, విగ్రహాల పెయింటింగ్, దెబ్బతిన్న గ్రానైట్ మొదలైన మరమ్మతు పనులను ముందుగా ప్రారంభిస్తామన్నారు.

మాట్లాడుతున్న మంత్రి నారాయణ

వీధి కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణల ఆదేశాల మేరకు పశు వైద్యాధికారి డాక్టర్. మదన్ మోహన్ పర్యవేక్షణలో నగరంలోని అన్ని డివిజనుల్లోని వీధి కుక్కలకు శుక్రవారం రెండవ విడత రేబిస్ వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేశారు. వీధి కుక్కలకు నిరంతరం శస్త్ర చికిత్సల ప్రక్రియను నిర్వహిస్తున్నామని తెలిపారు. కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాల్లో స్థానిక సచివాలయంలో ఫిర్యాదులు అందించాలని నవాచించారు. **కుక్కలతో బెంబేలు..**నెల్లూరు నగరంలోని బాలాజీ నగర్, ఎన్టీఆర్ నగర్‌లో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు తెలుపుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంలో తిరగాలన్న భయపడి పోతున్నారు.

8న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని జరపండి:'బుర్రా'

ప్రజాశక్తి-కందుకూరు: కీర్తిశేషులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి కార్యక్రమాలను కందుకూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించాలని మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ వైసిపి పార్టీ శ్రేణులకు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పరిపాలనలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వైఎస్ఆర్ విగ్రహాలను ముందుగానే శుభ్రపరిచి, నూతన రంగులతో అలంకరించడంతో పాటు, ఆరోజు జయంతి రోజైన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సమాయత్తం కావలసిందిగా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల పార్టీ కేంద్రాల్లోనూ, వైఎస్ఆర్ విగ్రహం ఉన్న ప్రతి గ్రామంలోనూ జయంతి కార్యక్రమం నిర్వహించాలన్నారు. అదేవిధంగా విగ్రహాలు లేని గ్రామాల్లో డాక్టర్ వైయస్సార్ చిత్రపటానికి జయంతి నిర్వహించి జన్మదిన కేకును కట్ చేసి, వికలాంగులకు,వితంతువులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆసుపత్రుల్లో రోగులకు పాలు, పండ్లు,బ్రెడ్ లాంటి పౌష్టిక ఆహారం పంపిణీ చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఉన్నటువంటి మానసిక వికలాంగుల పాఠశాలలు, వద్ధుల ఆశ్రమాల్లో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో కందుకూరు నియోజకవర్గ వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ విరివిగా పాల్గొనిమహానేతకు ఘనంగా నివాళులు అర్పించాలని తెలిపారు.

మాట్లాడుతున్న 'బుర్రా'(

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు పరిసర ప్రాంతాల్లో ఏ అవసరం వచ్చినా తన వంతు చేయూతను అందిస్తూ, ఎల్లప్పుడూ ఇతరుల శ్రేయస్సు కోసం పాటుపడే మానవతావాది, ఎస్. సురేష్ రెడ్డి (సురేష్ రెడ్డి చికెన్ సెంటర్) మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కందుకూరులో కోవూరు రోడ్డులోని మానసిక వికలాంగుల కేంద్రానికి నెల సరిపడే నిత్యావసర సరుకులు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి తో పాటు దండే రమేష్, గంట సాయి, వెంకటరావు, సురేష్ రెడ్డి చికెన్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

సరుకులు అందజేస్తున్న దృశ్యం

వేరుశనగ రైతులకు అవగాహన

ప్రజాశక్తి-ఉలవపాడు

మండలంలోని కరేడు పంచాయతీ అనగాయపాలెం మూడో సచివాలయంలో వేరుశనగ పంటలో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలను అమలు పరచడం పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం కృషి విజ్ఞాన్ కేంద్రం కందుకూరు వారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన్ కేంద్ర కందుకూరి సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ జి ప్రసాద్ రావు, శాస్త్రవేత్తలు వెంకటేష్, జయలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం ఇంకా కూడా నూనెలను ఉత్తరదేశాల నుండి ఎగుమతి తెలుసుకుంటూ ఉందని స్వయం సమద్ధి ర్యాగించడానికి జాతీయ ఆహార భద్రత మిషన్లో భాగంగా వేరుజల్లులలో ఖర్చు తగ్గించి అధిక దిగుబడి సాధించడానికి సమగ్రపోషిత యాజమాన్యం సమగ్ర శాస్త్ర రక్షణ ద్వారా పీడపీడల యాజమాన్యం నేల ద్వారా సక్రమించే మొదలగు మొదలుపులు మొదలు కుళ్ళు ఎండు తెగులు యాజమాన్యం సహజ నూనెల దారి వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ రెడ్డి

పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి-కందుకూరు: పెన్షనర్ల కార్యాలయంలో కందుకూరులో సంఘ కమిషనర్ల సంఘ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారులుగా శంకర్ రెడ్డి, రాజయ్యలు పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా రావులకోల్లు వెంకటేశ్వర్లు ,అధ్యక్షులుగా చిమ్మిరి నరసింహం, సెక్రటరీగా ఎంఎస్ రాంబాబు, ఇంటూరి మాల్యాద్రి, వై సత్యనారాయణ, చెన్నయ్య, పున్నయ్య, జీవీ కష్ణారావు, ఉపాధ్యక్షులుగా ఎం బైరాగి శాస్త్రి, సామాను బ్రహ్మయ్య, ఏవి నరసమ్మ ,షేక్ మహబూబ్ బాషా, నజీర్ అహ్మద్, ట్రెజరర్ గా పి. శ్రీనివాసరావు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విశ్వరూపాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరావు పాల్గొన్నారు. వక్తలు నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటవ తేదీనే పెన్షన్లు చెల్లించాలని, హెచ్ ఎస్ ద్వారా నగదు రహిత వైద్య సదుపాయాన్ని కల్పించాలని ,ప్రతి నియోజకవర్గ కేంద్రంలో పెన్షన్ భవనాలు నిర్మించి ఇవ్వాలని ,డి ఎ బకాయిలు వెంటనే చెల్లించాలని తీర్మానించారు.

కిడ్నాప్ కేసు ఛేదింపు

పోలీసుల అదుపులో నిందితుడు

-పోలీసులకు ఎఎస్‌పి అభినందనలు..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

బాలిక కిడ్నాప్ కేసును అత్యంత చాకచక్యంగా పోలీసులు ఛేదించారు. తోటపల్లిగూడూరు పోలీసులను అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) సిహెచ్ సౌజన్య ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం మీడియా సమావేశంలో అందించిన సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. పట్టపు శాంతి కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తతో విడిపోయి కుమార్తె, కుమారుడితో కలిసి తోటపల్లిగూడూరు మండలం వెంకన్నపాలెం గ్రామంలో కూలిపనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. భర్తతో విభేదాల కారణంగా విడిపోయిన శాంతి మూడు సంవత్సరాల క్రితం కనిగిరి మండలం, బల్లిపల్లి పంచాయితీ, విశ్వనాథపురం గ్రామానికి చెందిన కొమ్మి మల్లికార్జునను పెళ్లి చేసుకొని వెంకన్నపాలెం గ్రామంలో కాపురం పెట్టింది. వీరి మధ్య కూడా మనస్పర్ధలు నెలకొన్నాయి. దాంతో భార్యపై కక్ష సాధించాలనే ఉద్దేశంతో నిందితుడు మల్లిఖార్జున మహాలక్ష్మీపురం గ్రామంలోని స్కూల్ బట్టలు కొనిస్తానని మాయ మాటలు చెప్పి నమ్మించి శాంతి కుమా ర్తెను గత నెల 29వ తేదీ మోటార్ సైకిల్ పై ఎక్కించుకొని తన స్వగ్రామమైన ప్రకాశం జిల్లా కనిగిరి మండలం, బల్లిపల్లికి తీసుకెళ్లడం జరిగింది. తన కుమార్తె కనిపించడం లేదంటూ బాలిక తల్లి శాంతి గత నెల 30వ తేదీ తోట పల్లిగూడూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ జంపాని కుమార్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్, అడిషనల్ ఎస్‌పి సౌజన్య ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జి డిఎస్‌పి డి. శ్రీనివాస రెడ్డి, కృష్ణపట్నం పోర్టు సిఐ వెం కట రెడ్డి సూచనల మేరకు ఎ స్ఐ జంపాని కుమార్ బాలిక మిస్సింగ్ కేసును ఛాలెంజ్ గా తీసుకొని దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా కనిగిరి మండలం, బల్లిపల్లి పంచాయితీ అటవీ ప్రాం తంలో నిందితుడు మల్లిఖార్జున్ ఉన్నట్లు గుర్తించారు. చాకచక్యంగా వ్యవహరించి అదుపులోకి తీసుకొన్నారు. అతని వద్ద బందీగా ఉన్న బాలికను సురక్షితంగా తల్లి శాంతికి అప్పగించారు. బాలిక మిస్సింగ్ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జి డిఎస్‌పి శ్రీనివాస రెడ్డి, పోర్టు సిఐ వెంకట రెడ్డి, టీపీ గూడూరు ఎస్ఐ జంపాని కుమార్, సిబ్బందిని అభినందించి, రివార్డులు అందించారు.

పోలీసుల అదుపులో నిందితుడు

పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనసేన నాయకులు

కలెక్టర్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాకు కొత్త గా వచ్చిన కలెక్టర్ ఆనంద్ ను జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గునుగుల కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసిన జనసేన నాయకులు పూల బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు కలెక్టర్‌తో మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల వైసిపి పరిపాలన లో మట్టి, ఇసుక,గ్రావెల్,అక్రమ రవాణా జరుగుతుందని ఎంతో మంది అధికారులకు తెలిపినా కూడా వినిపించుకునే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు.సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ మంచి నిర్ణయం తీసుకొని ప్రజా ప్రభుత్వానికి అవకాశం ఇవ్వడం సంతోషకరమన్నారు. ప్రజా సమస్యలను కలెక్టర్ దష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి మార్గాలను చూపి సహకరించవలసిందిగా కోరారు. అనంతరం గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో పాటు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని కూడా కార్యాలయం లో ఉంచవలసిందిగా అభ్యర్థించి ఫోటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తో కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, హేమచంద్ర యాదవ్,మౌనిష్,హరి,ఇషాక్, బన్నీ,తదితరులు పాల్గొన్నారు

సర్టిఫికెట్స్‌ను అందజేస్తున్న ఎంఎల్ఎ సోమిరెడ్డి

పట్టుదలతో చదవాలి

ప్రజాశక్తి-వెంకటాచలం

విద్యార్థులు పట్టుదలగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తే మంచి జీవితాలతో స్థిరపడవచ్చు అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గురుకుల పాఠశాలలో ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కరించి మెడల్ సర్టిఫికెట్స్‌ను సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అందజేశారు. కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పునాస మామిడిని వదలని తామర పురుగు ..

ప్రజాశక్తి-కందుకూరు

మామిడి తోటల పాలిట మహమ్మారి వంటి తామర పురుగు పునాస పూతలను సైతం వదలలేదు. పునాస మామిడి తోటల్లో పూతలను తామర పురుగు ధ్వంసం చేస్తుంది. సాధారణ మామికి భిన్నంగా పునాస మామిడి తోటల్లో జూన్ ,జూలైలలో పూతలు వస్తాయి. ఆగస్టు నుంచి జనవరి వరకు పునాస తోటల్లో పూతలు ,కాయలు వస్తూనే ఉంటాయి. జిల్లాలో సుమారు 4000 ఎకరాల్లో పునాస మామిడి తోటలున్నాయి. ఈ తోటల్లో ఎక్కువ భాగం కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు ,ఉలవపాడు మండలాలలో విస్తరించి ఉన్నాయి. ఈ తోటల్లో ఇప్పటికే పూతలు కనిపిస్తున్నాయి. కొన్ని తోటలు దండిగా పూత మీద ఉండగా మరికొన్ని తోటల్లో పిందెలు కనిపిస్తున్నాయి. పూతలు వచ్చి రావడంతోనే తామర పురుగు దాడి చేస్తుంది. గత ఫిబ్రవరి ,మార్చి నెలలో సాధారణ మామిడి తోటల ను నష్టపరిచిన తామర పురుగు పునాస తోటలపై సైరవిహారం చేస్తుంది. పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ దాటితే తామర పురుగు విజృభిస్తుంది. ఇప్పుడు పగటి ఉష్ణోగ్రత 37 నుంచి 39 డిగ్రీల మధ్య తచ్చెట్లాడుతుంది. దీంతో సహజంగానే పునాస మామిడి తోటలోని పూతలను తామర పురుగు ఆశించింది. పూతలను తామర పురుగు ఆశిస్తే అవి నల్లగా మారి అవి రాలిపోతాయి. పిందెలు పడవు. అక్కడక్కడ పిందెలు బతికి బట్ట కట్టినప్పటికీ కాయలపై మంగు ఏర్పాటుతోంది. మంగు ఏర్పడిన పునాస మామిడి కాయలకు మార్కెట్లో తక్కువ ధరలు పలుకుతాయి. తామర పురుగును తాత్కాలికంగా అదుపు చేయడానికి తప్ప పూర్తిగా నిర్మూలించే క్రిమిసంహారకాలు అందుబాటులో లేవు. క్రిమిసంహారకాలు పిచికారి చేసినప్పటికీ మూడు నాలుగు రోజులు మాత్రమే తామర పురుగుల ఉధతి తగ్గిపోతుంది. ఐదు రోజుల లో తామర పురుగులు మళ్ళీ చెల్లరేగుతాయి. ఈ అనుభవాలతో తామర పురుగు చూసి పునారస మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే వాతావరణం చల్లబడితే తామర పురుగు ఉధతి సహజంగానే తగ్గిపోయే అవకాశం ఉంది. అడపాదడపా వర్షపు జల్లులు పడుతున్నప్పటికీ పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్ కు తక్కువగా నమోదు కావడం లేదు. దాని వల్లనే తామర పురుగు ఉధతి పెరుగుతోంది.

అరుంధతీయవాడలో తాగునీటి వసతి..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని పాపిరెడ్డిపాలెం పంచాయతీలోని అరుంధతీయవాడకు తాగునీటి వసతి కల్పించినట్లు సర్పంచ్ కదురు వెంకట సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు కోడూరు చంద్రశేఖర్ రెడ్డితో కలసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా అరుంధతీయవాడలో ప్రజలు తాగునీటి విషయంలో ఒకింత ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ నేపథ్యంలో సుమారు లక్ష రూపాయలు వెచ్చించి కొత్త పైప్ లైను, పైపాయింట్ మోటారు ఏర్పాటు చేశామన్నారు.. దాంతో అరుంధతీయవాడలోని 50కి పైగా గృహలకు పుష్కలంగా తాగునీటి తాగునీరు అందుతుందని సర్పంచ్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడంతో మౌలిక వసతులను కల్పించే విషయంలో ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో అరుంధతీయవాడలో తాగునీటి పథకం మరమ్మతులకు నోచుకోలేదని చెప్పారు. దాంతో ప్రజలు తాగునీటి విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోడూరు చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో నడిపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరవళ్లూరు రామసుబ్బయ్య, పెంచలయ్య, ఎస్. కె కరీముల్లా, కె. రాము, కదురు పెంచలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు. తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో అరుంధతీయవాడ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తాగునీరు వస్తున్న దృశ్యం

హత్యకేసులో నిందితులు అరెస్టు

- గంటల వ్యవధిలోనే కేసును చేదించిన పోలీసులు

ప్రజాశక్తి-నెల్లూరు : హత్య జరిగిన 24 గంటల వ్యవధిలోపు పూజారి చంద్రశేఖర్, తోడేటి సుమంత్, షేక్ రెహ్మాన్, చంద్రగిరి శ్రీనివాసులు, షేక్ అస్సిత్ అనే ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అడిషనల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య పేర్కొన్నారు. శుక్రవారం ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం రామకోటయ్యనగర్ ప్రాంతంలో యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు వేదాయపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో ఫిర్యాదు వచ్చిందన్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 10 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశామని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగిందని గుర్తించామన్నారు. గత ఏడాది రామకోటయ్య కాలనీ ప్రాంతానికి చెందిన పూజారి చంద్రశేఖర్ అలియాస్ చందు అనే వ్యక్తికి అదే కాలనీకి చెందిన దేవానంద్ అనే వ్యక్తితో కొట్లాటలు ఘర్షణలు జరుగుతుండేవన్నారు. ఈ క్రమంలో దేవానంద్‌కు స్నేహితులైన శేఖర్ నీలి రాజ్, జీవన్‌సాగర్, వెంకటేష్, మోహిత్‌లు పూజారి చంద్రశేఖర్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన పూజారి చంద్రశేఖర్ వైద్య చికిత్స అనంతరం తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చిన పూజారి చంద్రశేఖర్ తనపై దాడికి పాల్పడిన వ్యక్తులపై పగబట్టి పక్కా ప్రణాళిక ప్రకారం శేఖర్ నీలిరాజును తుదముట్టించేందుకు వ్యూహరచన చేశారన్నారు. ఈ క్రమంలో పెట్రోల్ బంకు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పూజారి చంద్రశేఖర్ స్నేహితులైన షేక్ రెహమాన్, షేక్ అస్సిత్, చంద్రగిరి శ్రీనివాసులు, సుమంత్ అనే వ్యక్తులతో కలిసి మద్యం సేవిస్తున్నారన్నారు. ఈ సమయంలో శేఖర్ నీలిరాజు అతని స్నేహితుడు షేక్ అఫ్రోజ్‌తో కలిసి సమీపంలో ఉన్న బార్‌లో మద్యం సేవిస్తున్నట్లు సమాచారం తెలిసిందన్నారు. అయితే ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం గతంలో ఉన్న కేసు రాజీ చేసుకునేందుకు మాట్లాడేందుకు రావాలని షేక్ అఫ్రోజ్‌కు సూచించారన్నారు. ఈ క్రమంలో పాత కేసు రాజీ చేసుకునేందుకు స్నేహితుడికి మాటలు నమ్మి శేఖర్ నీలిరాజ్ చేరుకోవడంతో ఒక్కసారిగా కత్తులతో దాడి చేసి ప్రాణ భయంతో షేక్ అఫ్రోజ్ పారిపోగా, శేఖర్ నీలిరాజును కత్తులతో పొడిచి హత్య చేసినట్లు నిర్ధారించామన్నారు. ఈ కేసు విచారణలో నిందితులను అదుపులోకి తీసుకునేందుకు ప్రతిభను కనబరిచిన సిబ్బందిని అభినందించారు.

రక్తదానం గొప్పది..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మనిషి ప్రాణాలతో దినచర్య సక్రమంగా జరగాలంటే రక్తప్రసరణ ఎంతో అవసరమని, మనిషి ప్రాణాపాయంలో రక్తం సంజీవని వంటిదని ఎల్ఐసి బ్రాంచ్ కార్యదర్శి శ్యాం ప్రభాకర్, అధ్యక్షులు ఎస్ ప్రవీణ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (భారతీయ జీవిత బీమా సంస్థ) ఇచ్చిన పిలుపుమేరకు ఆత్మకూరు బ్రాంచ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 74వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎల్ఐసి ఆఫీసు ఆత్మకూరు బ్రాంచ్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో దాదాపుగా 50మంది రక్తదానం చేశారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు జె వి శివప్రసాద్ మాట్లాడారు. జాయింట్ సెక్రెటరీ టి.రమేష్, పి.సీనయ్య, సాయితేజ, రమాదేవి, ఇతర ప్రజాసంఘాల సిఐటియు జిల్లా నాయకులు జె వి శివ ప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి వేడిచర్ల, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని జన విజ్ఞాన వేదిక నాయకులు హరికృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సాదిక్ హుస్సేన్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వాగాల శ్రీహరి, విశ్రాంత ఉపాధ్యాయులు బదుగు శ్రీనివాసులు టిడిపి నాయకులు చంద్ర సేకరయ్యనాయుడు, పిడి సిరిమామిల వెంకటేశ్వర్లు, శ్రీనివాస స్కూల్ కరస్పాండెంట్ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై పోలీసుల కొరడా

ప్రజాశక్తి-కోవూరు : ఇసుక మాఫియాపై కోవూరు పోలీసులు కొరడా ఝళిపించారు. మొన్న ఇసుక ట్రాక్టర్, నేడు టిప్పర్ పట్టుకొని సీజ్ చేశారు. మండల పరిధిలోని పెన్నా పరివాహక ప్రాంతం నుంచి శుక్రవారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తోన్న టిప్పర్‌ను ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తన సిబ్బందితో కలిసి తనిఖీల్లో భాగంగా ఇనమడుగు సెంటర్ వద్ద పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు.

నానోప్లస్ యూరియాతో దిగుబడి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : నానో యూరియాతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఇందుకూరుపేట అగ్రికల్చర్ ఏడి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాములవారిపాలెం గ్రామంలో ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మి నారాయణతో కలిసి రైతు వెంకటేశ్వర్లు పొలంలో నానో యూరియా ప్లస్‌ను పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ రాజ్ కుమార్ మాట్లాడుతూ నానో యూరియా ప్లస్‌తో గతంలో కంటే రైతులు తక్కువ కర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఒక్క బాటిల్ ఒక్క యూరియా బస్తాతో సమానంగా పనిచేస్తుందని తెలిపారు. తెగుళ్ల పంటకు సోకకుండా ఒక కవచంలా నానో యూరియా పని చేస్తుందని తెలిపారు. నానో యూరియాను గతంలో వాడిన రైతులు అధిక దిగుబడులు సాధించారన్నారు. రైతులందరూ నానో యూరియాను వాడి అధిక లాభాలు పొందాలని కోరారు. వ్యవసాయశాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : గ్రామీణ ప్రజలు అతిసార వ్యాధి నివారణ, డెంగీ వ్యాధి నివారణపై అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా జీవించాలని ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. శుక్రవారం కావలి మండలం కట్టకిందపాలెం గ్రామంలో సచివాలయం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో 'అతిసార' వ్యాధి నివారణ, డెంగీ నివారణ మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సుధాకర్, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఎ.ఎన్.ఎం. శ్రీ విధ్య, సి.హెచ్.ఓ.లలిత, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహారపొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా యూనియన్ వారి సౌజన్యంతో ఆపద్బాంధవ సేవాట్రస్ట్ చైర్మన్ దామ మధుసూదన రావు ఆధ్వర్యంలో కాలేరు గిరిజన కాలనీలోని పేదవారికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయినాథ్ సింగ్ మాట్లాడుతూ తమ యూనియన్ తరఫున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, గత నెలలో కావలి ఎల్.ఐ.సి. బ్రాంచిలో మెడికల్ క్యాంపు నిర్వహించామని, మరి ఈరోజు అట్టడుగున నివసిస్తున్న కాలేరుగుంట కాలనీ వాసులకు భోజనం ప్యాకెట్స్ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కావలి బ్రాంచ్ అధ్యక్షుడు సి.హెచ్.ఫణీంద్ర కుమార్, సెక్రటరీ బి.సాయినాథ్ సింగ్, ఐ.వి.ఫణికుమార్, ఐఆర్ ఎస్ ఫణీంద్ర, మధుసూదన్ రావు, వేణుమాధవరావు, ఎమ్.రవికుమార్, ఎస్.మోహన్, మహిళా సభ్యులు కె.వి.ఎస్.లక్ష్మి, కె.గీతాకుమారి, జి. భారతి, ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు రామచంద్ర, ఉపాధ్యక్షురాలు శారద, టైం టు హెల్ప్ రమేష్, నూరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో 110 నూతన బస్సులు

ప్రజాశక్తి-ఉదయగిరి : నెల్లూరు రీజియన్‌లోని అన్ని డిపోలకు 110 నూతన బస్సులు మంజూరైనట్లు రీజనల్ మేనేజర్ జి.విజయరత్నం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌టిసి డిపోలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్యారేజీ, టైర్లు, బస్సుల కండిషన్ తదితర విభాగాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు సూచించారు. ముందుగా డిపోకమిటీ వారు ఆయనను కలసి స్వాగతించి పూలమాలలు శాలవాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.శ్రీనివాసులు, రీజనల్ బాధ్యులు ఎస్థాని, డిపో కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి రవి, సుదర్శన్ పాల్గొన్నారు.

బాలికలను సంరక్షించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : బాలికల సంరక్షణే ధ్యేయంగా, వారికి కావాల్సిన సంపూర్ణ ఆరోగ్య పరీక్షల గురించి, అంగన్‌వాడీలు, ఆరోగ్యసిబ్బంది, ఆశ వలంటీర్లు సరైన అవగాహన కలిగి ఉండాలని, జిల్లా డిసిపిఒ సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఆత్మకూరు ఐసిడిఎస్ కార్యాలయంలో ఎఎన్‌ఎంలు, ఆశా వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆడపిల్లలపై సంరక్షణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్న వయసులోనే ఆడపిల్లలకు వివాహం చేయడం నేరమన్నారు. ఈ సందర్భంగా ఆడపిల్లల సంరక్షణకు తీసుకోవాల్సిన అంశాలను పొందుపరిచిన కార్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు తహాశీల్దార్ శివ నాగిరెడ్డి, సిడిపిఒ సునీలత, ఆత్మకూరు అర్బన్ కేంద్రం డాక్టర్ అస్మ, సూపర్‌వైజర్లు సుధాకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, విజయలక్ష్మి, పలువురు అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని ఎంఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఎపి ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ అకాడమీ, నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన ఎంప్లాయబిలిటీ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై ట్రైనర్ హరికుమార్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళాశాలలో విద్యార్థులకు ఇటువంటి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

వైద్యుల్లేక రోగుల అవస్థలు

- ఇష్టారాజ్యంగా మారిన సిబ్బంది హాజరు - మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నామమాత్రంగా వైద్యసేవలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు సరిగా విధులకు హాజరు కాకపోవడంతో పేదలకు వైద్యం అంతంత మాత్రంగా అందుతోంది. రోగులకు 24గంటలు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి. అయితే నెలకు 4 లేదా 5సార్లు మాత్రమే మైపాడు డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉంటారు. దాంతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్యసేవలు అందకపోవడం ఇందుకూరుపేట మండల కేంద్రానికి పరుగులు తీస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆస్పత్రిలో ఉద్యోగుల పనితీరు మరింత అధ్వానంగా తయారైందని రోగులు వాపోతున్నారు. వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరుకావడం,

మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



డాక్టర్ లేక ఖాళీగా దర్శనమిస్తున్న సీటు

సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత ఆస్పత్రిని బంద్ చేసి వెళ్లడంపై రోగులు అసహనం వ్యక్త పరుస్తున్నారు. మైపాడుతోపాటు చుట్టుపక్కల గ్రామ లైన గంగపట్నం, కృష్ణాపురం, కొలిమిట్ట పాలెం, కోరుటూరు, పల్లెపాలెం గ్రామలలోని ప్రజలు ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారు. కానీ సకాలంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఎక్కడికి వెళ్ళాలో తెలియక ప్రయివేటు ఆసుపత్రికి తరలి వెళుతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, పింఛన్‌తో బతికే ముసలివారు, ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందక ఇబ్బంది పడుతున్నారు. మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదలకు వైద్యసేవలు అంతంతమాత్రంగా పట్టించుకోక పోవడంతో రోగులు పెదవి విరుస్తున్నారు. సాయంత్రం సమయంలో వైద్యం కోసం వెళ్తే సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. జిల్లా వైద్యాధికారులు స్పందించి రోగులకు 24 గంటలు వైద్య సేవలు అందించే విధంగా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

మెరుగోయిన కన్నయ్య, మైపాడు వాసి.

నాకు చెయ్యి కాలింది. గత కొన్ని రోజులుగా మైపాడు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నాను. ఒక్కసారి కూడా నన్ను డాక్టరు చూడలేదు. ఎప్పుడు వచ్చినా నర్సులు చూస్తారు తప్ప, డాక్టరు ఇక్కసారి కూడా చూసిన దాఖలాలు లేవు. ఎప్పుడో వారానికోసారి డాక్టరు కారులో వచ్చి ఒక గంట ఉండి వెళ్లిపోతారు.

పుట్టా పెద్ద తాతయ్య, మైపాడు వాసి

నాకు చాలా ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. నేను తరచూ ఆసుపత్రికి వస్తాను. ఎప్పుడు వచ్చిన నన్ను నర్సులు చూస్తారు తప్ప ఒక్క సారి కూడా నన్ను డాక్టరు చూడలేదు. నర్సులు ఏ మందులు ఇస్తే అవే మందులు వాడుతున్నాము. రాత్రిళ్ల అత్యవసర సమయాల్లో ఎవ్వరూ అందుబాటులో ఉండరు.

మంత్రి అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న 'కాకర్ల'

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన ఎంఎల్ఎ 'కాకర్ల'

ప్రజాశక్తి-ఉదయగిరి

వ్యవసాయశాఖ మంత్రి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం విజయవాడలోని అచ్చెన్నాయుడు పార్టీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి తోడ్పాటు కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిశామని అందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గ మెట్ట ప్రాంత అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందించాలని అచ్చెన్నాయుడును కోరినట్లు, దానికి మంత్రి సానుకూలంగా స్పందించారని అందుకు ఆయనకు నియోజకవర్గం ప్రజలు తరుపున కృతజ్ఞతలు తెలిపామన్నారు. త్వరలోనే ఉదయగిరి నియోజకవర్గం రైతంగానే అన్ని విధాల ఆదుకుంటామని ప్రతి రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కలెక్టర్‌ను కలిసిన ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-కోవూరు

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఒ.ఆనంద్‌ను కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌కు వెళ్లిన ప్రశాంతిరెడ్డి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై ఇరువురు చర్చించారు. ఎంఎల్ఎవెంట నాయకులు చెముకుల కృష్ణచైతన్య, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.

కలెక్టర్‌ను కలసిన సర్పంచ్‌లు

ప్రజాశక్తి-కలిగిరి

నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఒ.ఆనంద్‌ను మండలంలోని రావులకొల్లు సర్పంచ్ పూసాల వెంగప నాయుడు, ఏపినాపి సర్పంచ్ వరప్రసాద్‌లు శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్లో కలిసి పుష్పగుచ్ఛి అభినందనలు తెలియజేశారు. మండలానికి సంబంధించి పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

మూడు చక్రాల స్కూటీ వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి రూరల్ మండలం రుద్రకోట ఎస్‌టి కాలనీకి చెందిన దివ్యాంగుడు చలంచర్ల ప్రహ్లాద్‌కు శుక్రవారం మూడు చక్రాల స్కూటీని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి (కావ్య క్రిష్ణారెడ్డి) వితరణ చేశారు. ఎన్నికల సమయంలో ఎస్టీ కాలనీ కి వెళ్లిన ఎమ్మెల్యేకు దివ్యాంగుడు ప్రహ్లాద్ పరిస్థితి దయనీయంగా కనిపించడంతో అతనికి స్కూటీ తీసిస్తానని ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం ఎంఎల్ఎ తన సొంత నిధులు వెచ్చించి టిడిపి కార్యాలయం వద్ద దివ్యాంగునికి స్కూటీని అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, రుద్రకోట నాయకులు డి.తిరుమల, వల్లెపు బాలకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి

ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి (కావ్య క్రిష్ణారెడ్డి) జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. కావలి నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి కోరారు.

పోస్ట్‌మాస్టర్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

పుల్లాయపల్లి బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న పోస్ట్ మాస్టర్ షేక్.నాయబ్ రసూల్‌ను వెంటనే అరెస్టు చేసి రోజువారి కూలీల ఖాతాదారులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం స్థానిక పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఆవరణంలో సిపిఎం, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, సర్పంచ్ కల్లూరి శ్యామలాదేవి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పుల్లాయిపల్లి బోడబండ గ్రామాల మోసపోయిన ఖాతాదారుల తో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసం చేసిన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌ను వెంటనే అదుపులో తీసుకొని తమ సొమ్మును అందించాలని ఆధార్, పాన్ కార్డు పేరిట వేలిముద్రలు సంతకాలు తీసుకొని ఉడాయించిన రసూల్‌ను వెంటనే అరెస్టు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. పిల్లల కోసం దాచుకున్న సొమ్మును నమ్మకంగా ఉంటూ రూ.10 లక్షలు మోసం చేశారన్నారు. అనంతరం పోస్ట్ ఇన్‌స్పెక్టర్ సాయి కృష్ణారెడ్డి స్పందించి ఆందోళనకారులు బాధితుల వద్దకు చేరుకొని ఈ సమస్యపై పోస్టల్ ఉన్నతాధికారుల దృష్టికి

ఆందోళన చేపడుతున్న బాధితులు, నాయకులు

తీసుకువెళ్తానని తెలిపారు. ప్రస్తుతం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రెండవ తేదీన కేసు నమోదు చేశామని ఇంతవరకు సమాచారం లేదని మళ్లీ కూడా పోలీసులను సంప్రదిస్తామన్నారు. ముఖ్యంగా నష్టపోయిన ఖాతాదారులు వారికి సంబంధించిన నగదు ముట్టలేదని రాతపూర్వకంగా అర్జీ రూపంలో ఖాతాదారులు తమ పాసు పుస్తకాలను జిరాక్స్ కాపీతో అందిస్తే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టి ఖాతాదారులకు న్యాయం చేస్తామన్నారు. పోస్టల్‌ఇన్‌స్పెక్టర్ సానుకూలంగా స్పందించడంతో ఆందోళన చేపడుతున్న ఖాతాదారులు నాయకులు వెనుదిరిగారు.

ఇసుక యార్డ్‌లో ఆర్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఇసుక డంపింగ్ యార్డ్‌ను ఆత్మకూరు ఆర్‌డిఒ మధులత, మైనింగ్ డిడి శ్రీనివాస్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసుకఅక్రమ రవాణా జరుగకుండా డంపింగ్ యార్డ్‌ను 24గంటలు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సహాయకులు పర్యవేక్షిస్తారన్నారు. వాహనాలు లోపలికి వెళ్లకుండా ఇసుక డంపింగ్ చుట్టూ కందకాలు తీయించారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు ఇసుక డంపింగ్ యార్డ్ రెవెన్యూ అధికారుల అధీనంలో ఉంటుందన్నారు. ఆమెవెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఇసుక డంపింగ్ యార్డ్‌లో పరిశీలిస్తున్న ఆర్‌డిఒ మధులత

తీరంలో వ్యక్తిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

సముద్రతీరంలో కొట్టుకుపోతున్న వ్యక్తిని మెరైన్ పోలీసులు కాపాడిన సంఘటన నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం మైపాడు సముద్రతీరంలో చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన కొండాయపాలెం గేటుకి చెందిన బల్లి ప్రజాపతి అనే వ్యక్తి 20 మంది స్నేహితులతో కలిసి మైపాడు సముద్రస్నానానికి వచ్చాడు. ప్రమాదవ శాత్తు సముద్రపు అలలలో కొట్టుకు పోతున్న వ్యక్తిని గమనించి అక్కడే ఉన్న మెరైన్ పోలీసులు తంబు వెంకటేశ్వర్లు, కె.ఎస్.రాజు సకాలంలో స్పందించి అలలో కొట్టుకుపోతున్న ప్రజాపతినీ కాపాడారు. సకాలంలో స్పందించి కాపాడిన మెరైన్ పోలీసులను స్థానికులు, పర్యాటకులు అభినందించారు.

బడిఈడు పిల్లల తల్లులకు అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి : కొత్తపల్లి గిరిజన కాలనీలో బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంఇఒ-1 షేక్ మస్తాన్ వలీ అవగాహన కల్పించారు. శుక్రవారం మండల పరిధిలో జిల్లా ఉన్నత పాఠశాల బిజ్జంపల్లిని ఆయన తనిఖీ చేసి 'నేను బడికి పోతా' ర్యాలీ, ఐఇపి ప్యానెల్స్ ప్రారంభం, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ పనుల పరిశీలన, బడికిరాని విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పిఎం పోషణ్ పోస్టర్ ఆవిష్కరణ, మధ్యాహ్న భోజన పరిశీలన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. 6 నుండి 14 వయస్సు గల ప్రతి పిల్లవాడు బడిలోనే ఉండాలని,

పాఠశాలలో ఐఇపి ప్యానల్స్‌ను ప్రారంభించి బోధనలో ప్రతిరోజు ఐఇపి ప్యానల్స్ వినియోగిస్తూ ఉండాలని ఐఇపి ప్యానల్స్‌ను సుందరంగా అమర్చిన ప్రధానోపాధ్యాయులు షేక్.నాయబ్‌ను అభినందిం చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయబ్ భాషా, ఏడుకొండలు, సిద్దయ్య పాల్గొన్నారు.

రక్తదానంలో 'కావలి ఐఎంఎ' చరిత్ర

ప్రజాశక్తి-కావలి

కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శాఖ రాష్ట్రంలో ఒకే రోజులో అరుదైన రికార్డును సృష్టించిందని, జాతీయస్థాయిలో ఘన విజయం సాధించిందని కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు కావలి ఐఎంఎ హాల్లో డాక్టర్స్, స్వచ్ఛంద సేవాసంస్థలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ "డాక్టర్స్ డే" రోజున ఐఎంఎ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాలలో పలు స్వచ్ఛంద సేవాసంస్థలు కావలి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కార్యక్రమానికి ముందుకు వచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్ఎ కావ్య క్రిష్ణా రెడ్డికి కూడా అసోసియేషన్ తరుఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి మనిషి ప్రాణాలను కాపాడినవారవుతారని తెలిపారు. అనంతరం సమావేశంలో

స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులను సత్కరిస్తున్న ఐఎంఎ బాధ్యులు

జ్ఞాపికలను బహుకరించారు. ఐఎంఎ కార్యదర్శి గోపి క్రిష్ణ, కోశాధికారి శివకుమార్, గౌరవ సలహాదారు డాక్టర్.బి. రవి కుమార్, కో ఆర్డినేటర్ డాక్టర్ నళిని పద్మ, సీనియర్ డాక్టర్ శ్రీరామ్ మనోహర్ బాబు, రెడ్‌క్రాస్ రవిప్రకాష్, పాదర్తి నాగరాజు, స్వచ్ఛంద సంస్థ లు బాషా, దిలీప్, జమీర్, సాయి, ఖాదర్‌బీ, తోట వెంకటేశ్వర్లు(జె.వి.వి), సలీం బాషా, యుటిఎఫ్ నాయకులు బి.శ్రీదేవి, జె.వి.వి. నాయకులు జి.కళ్యాణి, రెడ్‌క్రాస్ హరినారపరెడ్డి, రోటరీ బాధ్యులు స్వర్ణలత, సలీమ్ రుబేగ్, తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై అధికార పార్టీ నాయకుల జులుం తగదు

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి : కావలి, బోగోలు, దగదర్తి మండలాలలో పని చేస్తున్న స్కీం వర్కర్లను, స్కూళ్లలో పనిచేస్తున్న ఆయాలను, మధ్యాహ్న భోజన కార్మికులను, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లను, అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పనులలో ఆగిపోండి.. రాజీనామా చేయండి.. అని ఒత్తిడి చేయడం తగదని, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరి మాల్యాద్రి పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కావలి మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టిడిపి నాయకులు, అధికారులతో వాళ్ళని ఆపేయండి.. అని ఒత్తిడి చేయడం సరికాదని హితవు పలికారు. గత ప్రభుత్వం ఎలాగైతే చిరుద్యోగులపై తన ప్రతాపం చూపించిందో.. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆలా చేయడం మంచిది కాదని వారన్నారు. ఇటువంటి చర్యలను వ్యవసాయ కార్మిక సంఘం ఖండిస్తుందన్నారు. వ్యకాసం మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.సీతా రామయ్య, ఎం.రాధాకృష్ణయ్యలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం కందుకూరు డిఎల్‌పిఒ కృష్ణమోహన్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ పి ఆర్ వన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని పంచాయతీలో రిజిస్టర్ చేసి ఎప్పటికప్పుడు ఆ యాప్ ద్వారా అప్లోడ్ చేయాలన్నారు. కుష్టు వ్యాధి, పారిశుధ్య పనులకు సంబంధించి తరుచూ పర్యవేక్షించాలన్నారు. అతిసార వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తోట వెంకట కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SYED RAFI HUSSAINY (Old Name), Resident at Flat No. 201, Sahil Residency, Parameswari Nagar, Nellore, SPSR Nellore Dt- 524002, AP. Here by declare that I have changed my name as **SYED RAFI HUSSANY** (New Name) S/o. SYED AMEER JAN.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ గుంటూరు జిల్లా జడ్జి వారి కోర్టులో
MVOP No.127/2019

బిట్వీన్:

Gosala Yuvarani and 3 Others ....పిటీషనర్సు
And
1) Sri Ram Johnson.
2) Sreenivasulu Reddy Rami Reddy,S/o.Hazarath Reddy,R/o.7-15-10C/2B,Sankalavani Thota, Kavali, Nellore District,Owner of the Lorry No.AP 03 TC 1215.

ఈ నెంబరు MVOP దావాలో పిటీషనర్లు ఎన్ని పర్యాయములు MVOP దావా సమన్లు పంపించినను అతను R-2 తీసుకొనక పిటిషనర్లును చిక్కులు పెట్ట వలెననే దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున వారికి MVOP దావా సమన్లు అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు సబ్ స్టిట్యూట్ సర్వీసు ద్వారా పేపర్ ప్రకటనకు ఆర్డరు వేసి పై రెస్పాండెంట్ హాజరు నిమిత్తము ది.19-07-2014 సం. తేదీకి వాయిదా వేసినారు. కావున సదరు వాయిదాకు R-2 రెస్పాండెంట్ స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10గంటలకు శ్రీ గుంటూరు జిల్లా కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను, లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును .

పాటిబండ్ల శ్యామ్ సుంధర్,
కాకుమాన్ రమేష్,
పిటిషనర్ల తరపు అడ్వకేట్స్,
గుంటూరు.
సెల్: **9441236358,9246222344**

జనరల్ నోటీసు

నా క్లయింట్స్ అయిన 1.**మంచికలపాటి లక్ష్మీ నరసింహారావు,** తండ్రి లేట్ **ఎం.పి. మాల్యాద్రి** మరియు డా॥ **పి.లక్ష్మీ ప్రసన్న,** భర్త **ఎం.ఎల్.నరసింహారావు,** రిత్విక్ ఎన్‌క్లేవ్, వేదాయపాళెం, నెల్లూరు సిటీ అను వారలు ఇచ్చిన వివరముల మేరకు యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నాక్లయింట్స్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **తాళ్ళూరు ఫణి చక్రవర్తి,** తండ్రి **నరసింహారావు,** లీలాగ్రాండియర్ అపార్ట్‌మెంట్స్, శాంతి నగర్, నెల్లూరు సిటీ అను వారివద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనినారు. సదరు **తాళ్ళూరు ఫణి చక్రవర్తి** గారికి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి **తాళ్ళూరు కళ్యాణ్ చక్రవర్తి,** తండ్రి **నరసింహారావు** గారు రిజిష్టర్డు శెటిల్‌మెంటు పత్రం **తేది: 02-01-2020 డాక్యుమెంటు నెం.7/2020** ద్వారా చెందజేసినారని, సదరు కళ్యాణ్ చక్రవర్తి గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని తిరుమలశెట్టి వెంకట మధుసూదనరావు, తండ్రి వెంకట రమణయ్య గారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయ పత్రం **తేది: 14-07-2009 డాక్యుమెంటు నెం. 2431/2009** ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **వెంకట మధుసూదన రావు** క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని నెల్లూరు ఎ.పి. హౌసింగ్ బోర్డు తరపున ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయ పత్రం **తేది: 21-06-2007 డాక్యుమెంటు నెం.11682/2007** ద్వారా కొనుగోలు చేసినారని, సదరు అసలు రిజిష్టర్డు విక్రయ పత్రం **తేది: 21-06-2007 డాక్యుమెంటు నెం.11682/2007** నెల్లూరు ఎ.పి. హౌసింగ్ బోర్డు వారి వద్ద పోయినదని, సదరు నెల్లూరు ఎ.పి. హౌసింగ్ బోర్డు వారు **ఒరిజినల్ డాక్యుమెంటు నెం.11682/2007** కనిపించలేదని **తే26-08-2008**దిన సర్టిఫికేట్ ఇచ్చివున్నారని చెప్పుచున్నారు. మరియు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి పరాధీనములు, ఆడుమానములు, అగ్రిమెంట్లు, లీజులు, క్లయిములు, జప్తులు, కోర్టు వ్యవహారములు లేవని చెప్పుచున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికేని ఎటువంటి ఆక్షేపణలున్న ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజులలోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖిత పూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నాక్లయింట్స్‌ను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రి.డి.యిలాకా బుజబుజ నెల్లూరు స.రి.లో చేరిన, నెల్లూరు మునిసిపల్ కార్పోరేషన్‌లో చేరిన, కల్లూరు పల్లి ఏరియా, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డుకాలనీలోని సర్వే నెం.4 రు భూమి, ఎ.పి.హౌసింగ్ బోర్డు వారిచే లే అవుట్ చేయబడిన నెం.116/HIG రు ప్లాటు విస్తీర్ణం 348.05 చ.గ.లు స్థలమునకు హద్దులు:- తూర్పు: ప్లాటు నెం. 169/HIG రు, దక్షిణం: ప్లాటు నెం.117/ HIG రు, పడమర : 33 అడుగులు వెడల్పుగల లే అవుట్ రోడ్డు, ఉత్తరం: 33 అడుగులు వెడల్పుగల లే అవుట్ రోడ్డు, యీ హద్దులలోని 44'-9"×70'-0" కొలతలు గల 3132.50 చ.అ.లు లేక 348.05 చ.గ.లు స్థలమున్నూ ఈ స్థలమునకు సంబంధించిన యావత్తు యీజ్‌మెంటు హక్కులతోటి నీకు శెటిల్‌మెంటు చేయడమైనది.

జి.వి.ఎల్. నాగమణి, బి.ఎ., బి.ఎల్.,
అడ్వకేట్,
ఫస్ట్‌ఫ్లోర్, 25-1-672, జెడ్పీ కాలనీ,
పొదలకూరు రోడ్డు, నెల్లూరు, సెల్: **9441715096**